'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

# బిల్కిస్ బానోకు న్యాయం

***గుజరాత్*** *అల్లర్ల సందర్భంగా బిల్కిస్ బానోపై లైంగికదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఉదంతంలో 14 మందిని హతమార్చిన నేరస్థులకు శిక్షాకాలాన్ని తగ్గించి విడుదల చేయడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పు గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వానికి చెంపపెట్టు. ఈ తీర్పులో అప్పటి, ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలున్నాయి. అల్లర్ల ముసుగులో నేరస్థులు బిల్కిస్‌పై లైంగికదాడి జరిపే నాటికి ఆమె ఐదునెలల గర్భిణి. ఆమె కండ్ల ముందే నేరస్థులు ఆమె కూతురితో సహా ఇతర కుటుంబసభ్యులను చంపేశారు. అంతటి అమానుషానికి పాల్పడినవారికి ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించి విడుదల చేయడం, ఆపై వారికి దండలేసి సన్మానించిన దృశ్యాలు దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశాయి.*

*ఈ వ్యవహారమంతా న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగిందనేది చెప్పడానికి న్యాయనిపుణులే కానవసరం లేదు. నేరస్థులతో రాష్ట్ర ప్రభుత్వం 'మిలాఖతై' వ్యవహరించిందని సర్వోన్నత న్యాయస్థానం అక్షింతలు వేసింది. కేవలం ఈ అనుమానంతోనే నాడు కేసు విచారణను గుజరాత్ నుంచి మహారాష్ట్రకు బదిలీ చేశామన్న సంగతి గుర్తు చేసింది. నేరస్థులు తమ నేర నిరూపణ పర్యవసానాలను తప్పించుకోగలిగితే సమాజంలో శాంతి భద్రతలనేవి ప్రహసనంగా మారుతాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రతివాదుల (నేరస్థుల) స్వేచ్ఛను కోల్పోవడం గురించి చేసిన వాదన సబబైనదే అని కోర్టు మరో కీలక వ్యాఖ్య చేసింది. అయితే మరోమారు శిక్షాకాలం తగ్గింపు కోసం విజ్ఞప్తి చేసుకోవాలన్నా వారు జైలులో ఉండి మాత్రమే ఆ పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కోర్టును బురిడీ కొట్టించి, వాస్తవాలను తొక్కిపెట్టి శిక్షాకాలాన్ని తగ్గించడం ఏ మాత్రం చెల్లుబడి కాదని' తేల్చిచెప్పింది. నేర విచారణ మహారాష్ట్రలో జరిగితే శిక్షాకాలం తగ్గింపుపై ఆ రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించాలి తప్ప నేరం జరిగిన గుజరాత్ ప్రభుత్వం కాదని సుప్రీం కోర్టు ఎత్తిచూపింది.*

*ఒక నిందితుని శిక్షాకాలం తగ్గింపునకు సంబంధించి సుప్రీంకోర్టు 2022 మే 13న ఇచ్చిన తీర్పును ధర్మాసనంలోని జస్టిస్ నాగరత్న ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ తీర్పు శ్రీహరన్ కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. అంటే సారాంశంలో సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పును అడ్డుపెట్టుకుని చట్టవిరుద్ధంగా, కేసు పూర్వాపరాల గురించి ఆలోచించకుండా, సంబంధిత అంశాలను పరిగణించకుండా, అదీ 'ఇతరుల', అంటే ఇక్కడ మహారాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించాల్సిన అధికారాన్ని తానే లాగేసుకుని గుజరాత్ ప్రభుత్వం వ్యవహరించింది. తూతూమంత్రంగా ఓ కమిటీని వేసి, 'ఆ కమిటీ సిఫారసుల మేరకు' అంటూ శిక్షాకాలాన్ని తగ్గించివేసింది. కోర్టు ఆదేశాలను చట్ట ఉల్లంఘనకు ఒక ప్రభుత్వం ఎలా వాడుకోవాలో తెలిపే చక్కటి 'ఉదాహరణ'గా ఇది నిలుస్తుందని జస్టిస్ నాగరత్న చేసిన వ్యాఖ్య ఓ కనువిప్పు. ఆలస్యంగానైనా బిల్కిస్ బానోకు న్యాయం జరగడం ఆహ్వానించదగిన పరిణామం.*

ఏ దేశానికైనా పల్లెలే పట్టుగొమ్మలు. పల్లెలు పచ్చగా ఉంటేనే దేశం సుభిక్షంగా వర్ధిల్లుతుంది. ఈ సంగతి గమనించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి విశేష కృషి చేసింది. దీని కారణంగా తెలంగాణ గ్రామీణ, ఆర్థిక జీవనానికి జవసత్వాలు వచ్చాయి. సంపద ఒక్కరి దగ్గరే పోగు కాకుండా ప్రజలందరి చేతుల్లోకి వెళ్లింది. రైతు జీవనభద్రతే జాతి ఆహారభద్రత అని గుర్తెరిగిన పాలకుడు కేసీఆర్.

# ఎద్దు నవ్వాలె, ఎవుసం బతుకాలె!



**కరణం అంబికా కృష్ణ**

పాలకుల నిర్లక్ష్యంతో సేద్యం సంక్షోభంలో చిక్కుకుపోయింది. రైతు ప్రయోజనాలను, సేద్య ప్రగతిని, గ్రామీణాభివృద్ధిని వేర్వేరుగా పరిగణించినంత కాలం దేశ ప్రగతి ఎండమావి అని గ్రహించిన కేసీఆర్, రైతు స్వావలంబన కోసం కృషిచేశారు. ఈ కృషి ఫలితంగా భూమి ఉత్పత్తి వనరుగా, భూమే ఆదాయ మార్గంగా నేటి తెలంగాణ పల్లెలు పచ్చని పంటలతో అలరారుతున్నాయి.

రాష్ట్రంలోని 58 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నది. సాగు నీరు, రైతుబంధు, రైతు బీమా, పంట కొనుగోళ్లు, ఉచిత కరెంటుతో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచింది. అంతర్జాతీయ వ్యవసాయ వేదికలపై తెలంగాణ పథకాలు, ప్రగతిపై చర్చ జరుగుతున్నది. ఐరాస సంస్థ ఎఫ్ఏవో (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్) గుర్తించిన ప్రపంచ 20 ఉత్తమ పథకాల్లో రైతుబంధు, రైతుబీమా నిలవడం రాష్ట్రానికి గర్వకారణం. అమెరికాలో ఓ అంతర్జాతీయ వేదికపై తెలంగాణ వ్యవసాయ విజయాల గురించి చెప్పమని ఆహ్వానించడం రాష్ట్ర ఖ్యాతిని చాటింది. పత్తిని ప్రోత్సహించడం మూలంగా రాష్ట్రంలో జిన్నింగ్ మిల్లులు 400కు పెరిగాయి. వరి ఉత్పత్తి పెరగడంతో వేల సంఖ్యలో రైస్ మిల్లులు ఏర్పడ్డాయి. పంటల మార్పిడిలో తెలంగాణ రైతాంగం ముందున్నది. గతంలో 30 వేల ఎకరాలున్న ఆయిల్‌పామ్ విస్తీర్ణం అతి తక్కువకాలంలో లక్షా 94 వేల ఎకరాలకు చేరింది. విస్తీర్ణంలో తెలంగాణ కన్నా పెద్దగా ఉన్న యూపీ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ ప్రగతి కోసం పెడుతున్న ఖర్చులో 25 శాతం కూడా పెట్టడం లేదు. రాష్ట్రంలో సహకార రంగంలో రూ.6 వేల కోట్లున్న టర్నోవర్ నేడు రూ.20 వేల కోట్లకు పెరిగింది. వ్యవసాయంలో చెరువుల ప్రాధాన్యాన్ని గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' ద్వారా చెరువుల్లో పూడిక తీసి వాటిని సాగు యోగ్యంగా మార్చింది. ఫలితంగా తెలంగాణలో 2014 నాటికి 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం పదేండ్లలో.. 2022-23 నాటికి 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికితోడు ఉద్యానవన పంటలు 11.50 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి.




> వ్యవసాయరంగం 81.6 శాతం వృద్ధిని సాధించిందంటే బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలే కారణం. రాష్ట్ర జీఎస్డీపీ రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.13.50 లక్షల కోట్లకు పెరిగింది. అందులో వ్యవసాయరంగ వాటా 18.5 శాతం ఉండటం విశేషం.

రైతు ఆత్మహత్యల పీడను తెలంగాణలో లేకుండా చేయాలని, రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణ సాకారం కావాలని కేసీఆర్ సంకల్పించారు. ఇందుకు రైతులను రుణ విముక్తులను చేయడమే మార్గమని ఆయన ఆలోచించారు. ఇందుకోసమే పంట రుణమాఫీకి శ్రీకారం చుట్టారు. 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.లక్ష రుణం గల 40.74 లక్షల మంది రైతులకు చెందిన రూ.17,351 కోట్ల రుణాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేసింది. 2018లో మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి విడతలో 5.41 లక్షల మంది రైతులకు చెందిన రూ.1,198 కోట్ల రుణాలను మాఫీ చేసింది. రెండో విడతలో 22.46 లక్షల మంది రైతులకు చెందిన రుణమాఫీ కోసం రూ.18,242 కోట్లను రైతులకు అందజేసింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయరంగం అభివృద్ధిపై దృష్టిసారించి దాని బడ్జెట్‌ను పెంచి విశేష కృషిచేసిన కారణంగా తెలంగాణలో ఐదు విప్లవాలు సాకారమయ్యాయి. అవి గ్రీన్ రెవెల్యూషన్, వైట్ రెవెల్యూషన్, పింక్ రెవెల్యూషన్, బ్లూ రెవెల్యూషన్, ఎల్లో రెవెల్యూషన్. వీటిలో తెలంగాణ గణనీయమైన వృద్ధి సాధించింది. స్వరాష్ట్రంలో వరితో పాటు ఇతర పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం వరి సాగు విస్తీర్ణం 121 లక్షల ఎకరాలు కాగా, ధాన్యం ఉత్పత్తి 262 లక్షల టన్నులకు పెరిగింది. 2015-16తో పోల్చితే ధాన్యం ఉత్పత్తి 400 శాతం పెరిగింది. పాడి పరిశ్రమను, పాడి రైతులను ప్రోత్సహించడంతో పాల ఉత్పత్తి భారీగా పెరిగింది. 2014-15లో 42 లక్షల టన్నుల పాలు ఉత్పత్తి కాగా 2023 నాటికి 58 లక్షల టన్నులకు పెరిగి 38 శాతం పెరుగుదల నమోదైంది. పాడి రైతులకు దేశంలో మరెక్కడా లేనివిధంగా లీటర్‌కు రూ.4 ప్రోత్సాహకం అందించింది. ఈ మేరకు రూ.300 కోట్లు రైతులకు ఇచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకం పింక్ రెవెల్యూషన్‌ను సృష్టించింది. గొర్రెల సంఖ్యలో తెలంగాణ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 1.91 కోట్ల గొర్రెలున్నాయి. ఈ పథకంతో గొర్రెల సంఖ్య 48.51 శాతం పెరిగింది. 10.04 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తితో దేశంలో తెలంగాణ 5వ స్థానంలో నిలిచింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీతో రాష్ట్రంలో నీలి విప్లవం ఆవిష్కృతమైంది. చేపల ఉత్పత్తి 2.68 లక్షల టన్నుల నుంచి 3.90 లక్షల టన్నులకు పెరిగింది. చేపల ఉత్పత్తి విలువ రూ.2,637 కోట్ల నుంచి రూ.5,960 కోట్లకు పెరిగింది. ఆయిల్‌పాం సాగు ఎల్లో విప్లవానికి దారితీసింది. మొత్తం 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటివరకు 1.94 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతున్నది. ఇలా పలురకాల వ్యవసాయ పథకాలకు రూ.4.5 లక్షల కోట్లు ఖర్చు చేసింది ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వమే.

ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగు నీరందింది. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా దక్షిణ తెలంగాణలో 6 జిల్లాల్లోని మరో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు అందనున్నది. ఇవీ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పట్టుదల రాష్ట్ర వ్యవసాయరంగం దశదిశను మార్చేసింది. రైతుల ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు వచ్చాయి. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం రైతును, రాష్ట్ర వ్యవసాయరంగాన్ని ఇలాగే అభివృద్ధి దిశగా పయనింపజేస్తుందా, మళ్లీ మొదటికే తెస్తుందా అంటే కాలమే సమాధానం చెప్పాలి. ఏదేమైనా రైతాంగం సంబురంగా ఉంటేనే యావత్ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లుతుందనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరువరాదు.



> దళితులు, బీసీలు, మైనారిటీలతో పాటు అగ్రవర్ణాలకు చెందిన నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం విదేశీ విద్య, స్వయం ఉపాధి తదితర పథకాలు ప్రవేశపెట్టి, ఆయా వర్గాలను ఆదుకొన్నది. ఈ 75 ఏండ్లలో రాష్ట్రంలో గానీ, కేంద్రంలో గానీ ఏ ప్రభుత్వం కూడా అగ్రవర్ణ పేదల సంక్షేమం కోసం ఒక్క పథకాన్ని ప్రకటించలేదు. కానీ, తెలంగాణలోని సకలజనుల శ్రేయస్సే ధ్యేయంగా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ 2017లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తును ఏర్పాటు చేసి పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తిగా ఖ్యాతి దక్కించుకొన్నారు.

# విదేశీ విద్యకు మొండిచెయ్యి

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 2001 కింద బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్నది. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ఆధ్వర్యంలో మొత్తం 8 పథకాలు అమలవుతున్నాయి. అవి.. వివేకానంద విదేశీ విద్యా పథకం, శ్రీరామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్, వేద, శాస్త్ర పండితులకు గౌరవ వేతనం, వేదహిత - వేద పాఠశాలలు, వేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, సంప్రదాయ పాఠశాల - కంచి కామకోటి పీఠం, ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం, విప్రహిత బ్రాహ్మణ సదనం, తెలంగాణ బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు శిక్షణనివ్వడం వంటి కార్యక్రమాలున్నాయి.

విదేశాల్లో చదువుకోవాలనుకునే పేద బ్రాహ్మణ విద్యార్థులు ఆర్థికసాయం పొందేందుకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, పారిశ్రామిక ప్రోత్సాహానికి ఈ పరిషత్తు గత ఆరేండ్లుగా అండదండలు అందిస్తున్నది. కళాశాల ఫీజుల రాయితీలతో పాటు విదేశీ విద్యా పథకాల కింద ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల వరకు సాయం అందించింది. 2023 జనవరిలో ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైన 121 మంది పేద విద్యార్థులకు అప్పటి ప్రభుత్వం విదేశీ విద్యా పథకానికి సంబంధించి మంజూరు పత్రాలు అందించింది. ప్రభుత్వ సాయంపై నమ్మకంతోనే వారంతా బ్యాంకుల్లో రుణాలు తీసుకొని అమెరికా, కెనడా తదితర దేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లారు. ఒక్కొక్కరు రూ.50 లక్షల పైచిలుకు రుణాలు చేసి విదేశాల్లో మాస్టర్స్ చదువుతున్నారు. ప్రస్తుతం వారి ఎంఎస్ పూర్తి కావస్తున్నది కానీ ఇంతవరకు నిధులు వారి ఖాతాల్లో జమ కాలేదు.

> విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఫీజు రూ.40 లక్షలపైనే ఉంటుంది. గత జనవరి నుంచి పలుమార్లు అప్పటి ప్రభుత్వాన్ని ఈ విషయం గురించి విన్నవించాం. తీరా నిధులు అందించే సమయానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. దీంతో మరోసారి నిరాశ తప్పలేదు. ఈ పథక నిధులు ఆపటం వల్ల ఎందరో పేద విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు బ్యాంకుల్లో తీసుకొన్న రుణాల వడ్డీని వారి తల్లిదండ్రులు చెల్లిస్తున్నారు.

మంజూరై ఏడాది గడిచినా ఇప్పటివరకు లబ్ధిదారులకు డబ్బు అందలేదు. ప్రాధాన్య క్రమంలో వివేకానంద విదేశీ విద్యా పథకాన్ని విస్మరించటం వల్ల రుణ భారం పెరుగుతున్నది. గత ప్రభుత్వం ఏటా రూ.100 కోట్ల నిధులను కేటాయించేది. ఈ నిధులతోనే వివిధ పథకాలు అమలవడంతో పేద బ్రాహ్మణుల స్థితిగతులు మెరుగయ్యాయి. ప్రభుత్వాలు మారినప్పుడు సంక్షేమ పథకాల విధానాల్లో మార్పులు అనివార్యమే. నామినేటెడ్ పోస్టులను రద్దు చేయడంలో అర్థం ఉన్నది. కానీ, వారితో పాటు లబ్ధిదారులను కూడా తొలగించడం సరైనది కాదు. అలాగే సంక్షేమ పథకాలను రద్దు చేయడం సబబు కాదు.

విదేశాల్లో పీజీ, ఇతర ఉన్నత విద్యా కోర్సులు అభ్యసిస్తున్న వెనుకబడిన తరగతుల (బీసీ),ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈబీసీ) విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యా నిధి పథకం కింద ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 లక్షలు అందజేస్తున్నది. విద్యార్థుల ట్యూషన్ ఫీజులు, ఇతర ఖర్చుల కోసం ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సాయం ఉపయోగపడుతున్నది. కాగా, మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకంలో మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ పథకం మార్గదర్శకాలను మార్చేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్టు సమాచారం. మార్పులు చేస్తే చేయండి.. కానీ ఇదివరకే మంజూరు పత్రాలు పొంది విదేశాల్లో చదువుతున్న వారికి మొండిచెయ్యి చూపకూడదు.

> గత ప్రభుత్వం ఏటా జనవరిలో 150 మంది, ఆగస్టులో 150 మందిని ఎంపిక చేసి ఆర్థికసాయం చేసింది. దీంతో పాటు వీసా, ప్రయాణ ఖర్చులకు గరిష్ఠంగా రూ.50 వేలు అందించింది. ఇప్పటివరకు ఈ పథకం కింద సుమారు 2,700 మంది విద్యార్థులు లబ్ధి పొందినట్టు తెలుస్తున్నది. ఇదే తరహాలో ఎస్సీ, ఎస్టీలకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద సాయం అందిస్తున్నది. ఈ పథకాలన్నీ అటకెక్కితే పేద విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం.

తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారుల విషయంలో సానుభూతితో వ్యవహరించాలి. ఇప్పటివరకు ఈ పథకాల కింద మంజూరు పత్రాలు పొందినవారికి తక్షణమే నిధులు విడుదల చేసి ఆయా వర్గాల పేద విద్యార్థులను ఆదుకోవాలి. విధివిధానాల్లో మార్పుచేర్పులు చేసే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ, ఈ పథకం మీద కోటి ఆశలు పెట్టుకొని బ్యాంకుల్లో భారీగా రుణాలు తీసుకొని విదేశాలకు వెళ్లిన పేద విద్యార్థుల ఆశలు అడియాసలు కాకూడదు. ప్రభుత్వాలు మారినా పేదలకు అందే సంక్షేమ పథకాలు మారకూడదు.

**- వైనతేయ**

సంగీత సామ్రాజ్యాన్ని కొత్త పుంతలు తొక్కించి తనదైన శైలిలో అద్భుత పాటలతో ఆధ్యాత్మిక సినిమాలకు నిండుదనం తెచ్చిన సాహితీవేత్త, సినీ గేయ రచయిత వేదవ్యాస రంగభట్టర్.

# ఆధ్యాత్మిక గేయవాహిని

**1946,** జనవరి 10న తెలంగాణ రాష్ట్రం, మహబూబాబాదు జిల్లా, కేసముద్రం మండలంలోని కోమటిపల్లి గ్రామంలో రంగరాజ భట్టర్, రంగనాయకమ్మాళ్ దంపతులకు వేదవ్యాస రంగభట్టర్ జన్మించారు. 1968లో టీటీడీలోని ఎస్వీ ప్రాచ్య కళాశాలలో సంస్కృత సాహిత్య అధ్యాపకులుగా బోధన రంగంలోకి ఆయన ప్రవేశించారు. సాహిత్య శాఖ అధ్యక్షుడిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి 2004లో ఉద్యోగ విరమణ చేశారు.



**నేడు రంగభట్టర్ జయంతి**

> వేదవ్యాస రంగభట్టర్‌కు సినీ దర్శకుడు, రచయిత జేకే భారవి స్వయాన తమ్ముడు కావడం గమనార్హం. 1986లో తొలిసారి ఆయన 'రంగవల్లి' సినిమాకు పాటలు రాశారు. ఆ తర్వాత 'శ్రీమంజునాథ', 'రామదాసు', 'పాండురంగడు', 'షిరిడీ సాయి', 'అనగనగా ఒక ధీరుడు', 'ఝుమ్మంది నాదం', 'ఓం నమో వెంకటేశాయ' ఇలా దాదాపు 13 సినిమాలకు సాహిత్యం అందించారు. దాదాపు 80కి పైగా పాటలు రాశారు.

శ్రీ మంజునాథ చిత్రంలోని 'మహా ప్రాణ దీపం' పాట రంగభట్టర్‌కు మంచి పేరును తెచ్చింది. 'స్వరజ్ఞాన వర్షిణి' అనే కొత్త సాహిత్య సంగీత స్వర ప్రక్రియను రూపొందించి, వేంకటేశ్వరస్వామిపై 12, 16 స్వర స్థానాలతో 320 కీర్తనల వరకు రాశారు. 1996లో తిరుపతిలోని మహతి కళామందిరంలో 'ఎస్వీ నట శిక్షణాలయం' స్థాపించి ఔత్సాహిక కళాకారులకు పద్యపఠనం, పౌరాణిక నాటకాల్లో ఉచితంగా శిక్షణనందించారు. రోజా, సంఘవి వంటి నటీమణులకు కూడా నటనలో శిక్షణ ఇచ్చారు. అనేక నాటకాలను రాసి, వాటికి దర్శకత్వం వహించారు.



**సాయి లోహిత పులపా**

సాహిత్యంలో ఆయన చేసిన సేవలకు గాను 2003లో ఏపీ ప్రభుత్వం నంది అవార్డుతో సత్కరించింది. వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థల నుంచి కళాతపస్వి, దర్శకరత్న, కళారత్న, సాహితీ సార్వభౌమ వంటి బిరుదులను అందుకున్నారు. ఊపిరితిత్తుల వ్యాధికి తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2019, ఫిబ్రవరి 20న ఆయన మరణించారు. రంగభట్టర్ రాసిన పాటలతో ప్రజల హృదయాల్లో ఆయన ఎన్నటికీ చిరస్మరణీయుడే.

# రాజనీతిజ్ఞుడిని వదులుకున్నరు



**పాతూరి వేంకటేశ్వరరావు**
**98490 81889**

రానున్న ఎన్నికల గురించి ఆలోచించేవాడు రాజకీయ నాయకుడు! రాబోయే తరాల గురించి యోచించేవాడు రాజనీతిజ్ఞుడు. ఒక నాయకుడిని, రాజనీతిజ్ఞుడిగా తీర్చిదిద్దేవి దేశభక్తి, ప్రజల పట్ల ప్రేమ, ప్రజా సమస్యలను పరిష్కరించడం, సమాజాన్ని ప్రగతిపథాన నడిపించగల అపార పరిజ్ఞానం! నిరంతర పరిశీలన, అధ్యయనం, అన్వేషణలే అలాంటి జ్ఞానాన్ని సమకూర్చుతాయి!

**'పాలకులకు** చదివే తీరికుండదు. కానీ, చదువని వారు ఉత్తమ పాలకులు కాలేరు' అన్నాడు ప్లేటో. వర్తమాన భారతంలో కొందరు కమ్యూనిస్టు నేతలు తప్ప, జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలలో అధ్యయనం బొత్తిగా కొరవడింది! అందుకే నేడు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలతో ఓటర్లను సమీకరించుకోవటం, దేశ సంపదను బడా కార్పొరేట్లకు కట్టబెట్టి, వారిచ్చే నిధుల (క్విడ్ ప్రోకో)తో ఓటర్లు, ఎమ్మెల్యేలను కొనుక్కోవటం, అసాధ్యపు హామీల ఎరతో ఓటర్లకు గాలం వేయటం, అధికార పార్టీ నేతల గోరంత లోపాలను కొండంతలుగా ఊదరగొడుతూ ఉపన్యసించటం, అభాండాలతో అన్య పార్టీ నేతల క్యారెక్టర్‌ను దెబ్బతీసే సోషల్ మీడియాను పోషించటం, తమను భూతద్దంలో చూపే ప్రధాన మీడియాను కొనుక్కోవటం వగైరా ఎత్తుగడల్లో ఆరితేరిన మాయల మరాఠీలే తప్ప, భారతదేశానికి రాజనీతిజ్ఞులు బొత్తిగా కరువయ్యారు!

అపార ఖనిజాలు, జలాలు, సాగు భూములున్నప్పటికీ ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో నేటికీ, కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యాలకు దూరమవుతున్న పేదలు కోట్లలో ఉన్నారు. మేధావుల్లారా ఆలోచించండి. సర్దుకుపోవటమే మన కర్తవ్యమా? ఈ నేపథ్యంలోనే కదా, దశాబ్ద కాలం కిందట చావుకు తెగించి పోరాడి, ప్రత్యేక తెలంగాణను సాధించి, ప్రగతిపథాన నడిపించి, నాలుగవ భారతాగ్ర రాష్ట్రంగా రూపొందించారు తెలంగాణ పిత కేసీఆర్.

విద్యుత్తు, వ్యవసాయం, పారిశ్రామిక సంక్షోభాలతో



తల్లడిల్లుతున్న తెలంగాణలో, పొట్ట చేతబట్టుకొని పొరుగు రాష్ర్టాలకు వలసలెత్తిన లక్షలాది అభాగ్యులను చూశాం కదా! అలాంటి అణగారిన తెలంగాణకు నేడు, పొరుగు రాష్ట్రాల పేదలు, వ్యాపారులు, బహుళజాతి కంపెనీలు వచ్చి వాలుతున్న సౌభాగ్య తెలంగాణగా తీర్చిదిద్దారు గదా కేసీఆర్. ఆరు దశాబ్దాల్లో గత పాలకులు సాధించిన దానికి రెట్టింపు ప్రగతిని ఆయనెలా సాధించగలిగారు?

గద్దెనెక్కిన దగ్గిరినుంచి ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల్లా, గత ప్రభుత్వాల లోపాలెంచుతూ, గత పాలకులపై అభాండాలు వేస్తూ క్షణాన్ని కూడా వృథా చేయలేదు. నిర్విరామంగా తపస్సు చేశారు. తపస్సంటే... 'తెలంగాణ ప్రగతి సాధనా మార్గాన్ని దర్శించేదాక మేధోమథనం చేయటం!' ప్రగతి మార్గాన్ని అన్వేషిస్తూ, ప్రపంచ దేశాలను, నేతలను అధ్యయనం చేశారు కేసీఆర్. తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి, విద్యుదుత్పత్తికి భారీగా నిధులను కేటాయించారు. 'మిషన్ కాకతీయ' ద్వారా కాకతీయుల నాటి వేలాది చెరువులను పునరుద్ధరించారు. కాళేశ్వరం వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. తద్వారా తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగినయి. నిరంతరం విద్యుత్తు అందటంతో, ఆగి ఉన్న బోరు బావులన్నీ నీళ్లను పరుగెత్తించినయి. సాగునీటితో పంట చేలన్నీ పరవశించినయి. భారీగా ధాన్యం, పశుగ్రాసం పెరగటంతో, పేదలకు సబ్సిడీ, గొర్రెలు, బర్రెలను అందించారు. కోళ్ల పరిశ్రమలకు రాయితీలిచ్చారు. చెరువుల్లో చేప పిల్లల్ని వేయించి పెంచుకోమన్నారు. తద్వారా ధాన్యం, మాంసం, చేపలు, పాల ఉత్పత్తుల్లో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది.

'వృక్షో రక్షతి రక్షితః' అన్నారు మహర్షులు. ఎందుకంటే? భూ భాగంలో 33 శాతం అడవులుంటేనే, పర్యావరణం, ప్రాణులు క్షేమంగా మనగలుగుతయి. ఈ వాస్తవాన్ని గుర్తించినందుకే 22 శాతానికి పతనమైన అడవులను 'హరితహారం' పథకం ద్వారా గ్రామాల్లో నర్సరీల పెంపకం, అడవుల్లోని ఖాళీ ప్రదేశాల్లో పండ్ల చెట్లు నాటించడం ద్వారా 29 శాతానికి పునరుద్ధరించగలిగారు. తద్వారా ఓట్లు పడవని ఆయనకు తెలుసు. తెలంగాణ క్షేమదాయక భవితవ్యం కోసమే చేశారా పని. అందుకే 'రాజనీతిజ్ఞుడు-కేసీఆర్' అంటున్నారు విజ్ఞులు. రాజనీతిజ్ఞుడైన కేసీఆర్ తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' అవార్డును తెచ్చిపెడితే, కేవలం రాజకీయ నాయకుడైన మోదీ భారత రాజధాని ఢిల్లీకి, ప్రపంచాగ్ర కాలుష్యనగరంగా అపఖ్యాతిని తెచ్చిపెట్టారు.

'విజన్ కలిగిన రాజనీతిజ్ఞుడు కేసీఆర్ దేశాభివృద్ధికి తన విధానాలను స్పష్టీకరించారు. వ్యవసాయాభివృద్ధి ద్వారా భారత పారిశ్రామిక ప్రగతికి దృఢమైన పునాది వేస్తాననన్నారు. ప్రభుత్వ, ప్రైవేటురంగాల మధ్య పోటీని కొనసాగించటం ద్వారా దేశాన్ని ప్రగతి పథాన పరుగెత్తిస్తానన్నారు. భారతదేశ రాష్ట్రాల సమాఖ్యను రాజ్యాంగబద్ధంగా కొనసాగిస్తాననీ ప్రకటించారు. అందుకు సంకేతంగా తన పార్టీని బీఆర్ఎస్‌గా మార్చుకున్నారాయన. 'దేశ్ కీ నేతా కేసీఆర్!' అంటూ భారతదేశమే స్వాగతిస్తున్న తరుణంలో తెలంగాణాభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన రహదారిని నిర్మించిన అరుదైన విజనరీ నేత అయిన ఆయనను తెలంగాణ జారవిడుచుకోవటం నిజంగా దురదృష్టకరం.




## ప్రధానిని గౌరవించాల్సిందే

*మోదీ మన దేశ ప్రధాని. ఇతర దేశాలకు చెందిన వ్యక్తులు ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మేం దాన్ని అంగీకరించం. రాజకీయపరంగా అభిప్రాయ భేదాలున్నా.. ప్రధాని పదవిని మనందరం గౌరవించాలి. బయటి దేశాల నుంచి ప్రధానికి వ్యతిరేకంగా ఏది జరిగినా అంగీకరించబోం.*

***- శరద్ పవార్,*** *ఎన్సీపీ అధ్యక్షుడు*

